క్లుప్తంగా

ఎమ్మెల్యేగా భాష్యం ప్రవీణ్ ప్రమాణ స్వీకారం



పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడుగా కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అసెంబ్లీలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రేపు కొమెరపూడిలో ఉచిత మెగా వైద్య శిబిరం

సత్తెనపల్లి: గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ఈ నెల 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించటం జరుగుతుందని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ గ్రూప్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కార్తీక్ చౌదరి శుక్రవారం తెలిపారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో సీనియర్ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు డాక్టర్ గుడారు జగదీష్, సీనియర్ గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ అరుణ్, ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు డాక్టర్ బాలభాస్కర్, జీర్ణకోశ వ్యాధి వైద్య నిపుణుడు డాక్టర్ లోకేష్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణురాలు డాక్టర్ శుభ కట్టలు వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, గుండె, ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యేవారు తమ పాత రిపోర్టులను తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9700012398, 8886911511 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నాలుగు గ్రామాల్లో కౌలు రైతుల గ్రామ సభలు

సత్తెనపల్లి: కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (కౌలు రైతు కార్డు) అందించేందుకు సత్తెనపల్లి మండలం కందులవారిపాలెం, బృగుబండ, ధూళిపాళ్ల, కంకణాలపల్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు డి.నాగేశ్వరరావు, ఎం.శశిరేఖ, వై.నాగార్జున, ఆర్.చెన్నమ్మ, వీహెచ్ఏలు ఎస్.ప్రశాంత్, ఎం.జీవన్‌జ్యోతి, ఎం.దివ్య, షేక్ జాన్‌బాషాలు హాజరై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తులు అందించాలన్నారు. ఆయా సభల్లో కౌలు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామికి అభిషేకాలు



సత్తెనపల్లి: వర్షాభావ పరిస్థితులు తొలగి సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో లోకకల్యాణం కోసం పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసి యున్న భక్తాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారికి జ్యేష్ట మాస పూర్ణిమ సందర్భంగా శుక్రవారం అభిషేకాలు నిర్వహించారు. 108 కలశాలతో స్వామి వారికి పంచామృత సహిత విశేష జలాభిషేకం, వరుణయాగం చేపట్టారు. ఆలయ అర్చక స్వామి శ్రీమాన్ వేదాంతం విజయ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, మంటపారాధన, పంచామృత సహిత అష్టోత్తర శత కలశ జలాభిషేకం, వరుణయాగం నిర్వహించారు. అనంతరం స్వామి వారి దివ్య దర్శనం, నీరాజనం, మంత్రపుష్పం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బయ్యవరంలో కౌలు కార్డులపై అవగాహన

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామంలోని ఆర్బీకేలో శుక్రవారం కౌలు రైతులకు కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ ఏడాది కౌలు సాగు చేసే ప్రతి రైతు రెవెన్యూ శాఖ ఇచ్చే పంట సాగు పత్రాన్ని తప్పక పొందాలన్నారు. పంట సాగు పత్రం వలన పండించిన పంట మద్దతు ధరకు విక్రయించేందుకు వీలుపడుతుందన్నారు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం, బీమా, పంట నష్టం జరిగినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుందన్నారు. కౌలు కార్డులు పొందేందుకు భూ యజమాని పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, 1బి అడంగల్ కాపీ, భూ యజమాని ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలు రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, కౌలు రైతు పాస్‌పోర్టు సైజు ఫొటోలు-3, దరఖాస్తు ఫారం పూర్తిచేసి వీఆర్వోలకు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగపరచుకోవాలన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం

- పలు పాఠశాలల్లో యోగా దినోత్సవం
- ఉత్సాహంగా యోగాసనాలు వేసిన విద్యార్థులు



పట్టణంలోని సుగాలీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాసనాల్లో విద్యార్థులు

సత్తెనపల్లి: నిత్యం యోగ సాధనతో ఆరోగ్యవంతమైన జీవితం సాధ్యమవుతుందని స్వామి వివేకానంద చైతన్య భారతి సభ్యుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జేపీఎస్ శాస్త్రి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా జేపీఎస్ శాస్త్రి మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి భారతదేశం అందించిన అద్భుత, అమూల్య కానుక యోగా అని, యోగా ద్వారా జీవనశైలిని మెరుగుపరచుకోవచ్చన్నారు. యోగా ద్వారా సుఖమయ, ఆరోగ్యవంత, గౌరవప్రద జీవితానికి ఆస్కారం ఉంటుందన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు పుట్టి సాంబశివరావు మాట్లాడుతూ శారీరక, మానసిక రుగ్మతలను తొలగించుకోవడమే గాక జ్ఞాపకశక్తిని, ఏకాగ్రతను యోగాతో పెంపొందించుకోవచ్చన్నారు. బాల్యం నుంచే యోగాభ్యసనం అవసరమన్నారు. ఈ సందర్భంగా జేపీఎస్ శాస్త్రిని ఉపాధ్యాయులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అబ్బూరి సత్యనారాయణ, దేవరశెట్టి రవికుమార్, వెంకటనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక రుగ్మతలు దూరం

యోగాతో మానసిక రుగ్మతలు దూరం కావడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు పీఎం రమేష్ అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన ఉచిత యోగా శిక్షణలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు రమేష్ మాట్లాడుతూ రోజూ విధిగా యోగా చేసి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యోగా అభ్యాసకులు, తదితరులు ఉన్నారు.

ముప్పాళ్ళలో యోగా దినోత్సవం

ముప్పాళ్ళ: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక యోగా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుంభా నాగేంద్రమ్మ యోగా వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. మండల ఆయుర్వేద వైద్యురాలు పి.సరళ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. విద్యార్థుల్లో శారీరక దృఢత్వానికి యోగా దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ సుభాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొండపిలో...

మండలంలోని తొండపి ఎంపీయూపీ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో యోగా చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు జేవీ రమణరావు, జీ భానుప్రకాష్, ఎస్.కె. బాజీ, ఎంవీ శివకుమారి, కే సుజాత, ఏ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

అచ్చంపేట: యోగాతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కలుగుతుందని స్థానిక జెడ్పీ హైస్కూలు హెచ్ఎం చిగురుపాటి కళ్యాణి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా విద్యార్థుల యోగా విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజులో కొంత సమయం యోగా చేసేందుకు కేటాయించాలన్నారు. యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక పరిపక్వత కలుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి యోగాసన పోటీలలో బంగారు పతకం సాధించిన విద్యార్థి రాయిడి అజయ్‌కుమార్‌ని సత్కరించారు. విద్యార్థికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయిని ఆలపాటి సుజాతను ప్రత్యేకంగా అభినందించారు. మారుమూల గ్రామమైన అచ్చంపేటకు జాతీయ స్థాయిలో గౌరవం దక్కడం సంతోషకరమని హెచ్ఎం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో...

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా స్థానిక కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో వాసవీక్లబ్, విశ్వహిందూ పరిషత్ సంయుక్త నిర్వహణలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వాసవీ క్లబ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోటిలింగంబాబు, శేషగిరిరావు, లక్ష్మీశ్రీనివాసరావు, రవికుమార్, శంకరరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేది యోగా

పెదకూరపాడు: ఆత్మస్థైర్యాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందించేది యోగా అని పల్నాడు జిల్లా కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి గోగినేని వెంకటరమణ అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటరమణ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో యోగా పలు రకాలుగా ఉపయోగపడుతోందన్నారు. చెడు వ్యసనాలతో యువత జీవితాలు బలి చేసుకుంటున్నారన్నారు. వీటి నుంచి బయటపడాలంటే యోగా వల్ల సాధ్యమవుతుందన్నారు. ఎంఈవో ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో యోగా తరగతులు నిర్వహించాలని.. ప్రతి రోజు యోగా సాధన చేస్తే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, జ్ఞాపకశక్తి పెరుగుతాయన్నారు. హెచ్ఎం కె.వెంకటరమణ మాట్లాడుతూ క్రమశిక్షణతో మంచి పౌరులుగా ఎదిగేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న అమరావతి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నల్లూరి రాంబాబు మాట్లాడుతూ యోగా వల్ల రుగ్మతలు దూరమవుతాయన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, విద్యార్థులతో యోగ ఆసనాలు, ధ్యానం చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

సత్తెనపల్లి: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఓ మంత్రమని సత్తెనపల్లి కేంద్రియ విద్యాలయ ప్రధానోపాధ్యాయుడు జగదీష్ కుమార్ గుప్తా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సత్తెనపల్లి కేంద్రియ విద్యాలయంలో శుక్రవారం యోగా ప్రాముఖ్యతపై ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే యోగా సాధన చేయడం వలన ఎలాంటి రుగ్మతలకు గురికారన్నారు. సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది, పాల్గొన్నారు.

నందిగామలో...

సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పల్నాడు జిల్లా క్రీడా భారతి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కాకరపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పిచ్చయ్య, క్రీడాభారతి పల్నాడు జిల్లా కార్యదర్శి శివ రామకృష్ణ, క్రీడాభారతి ప్రతినిధులు సురేష్, వెంకటేశ్వరరావు, అనిల్ దత్తనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ అధికారులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య మాట్లాడుతూ యోగాసనాలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. మానసిక ప్రశాంతత పొందాలంటే యోగాపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ రమణ, ఎస్ఎస్ఐ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అదేవిధంగా పారుపల్లి గ్రామంలో అమృత సరోవర్ చెరువు వద్ద నిర్వహించిన యోగా దినోత్సవంలో ఎంపీడీవో కేవీ రమణ, ఈవోపీఆర్డీ శివరామయ్య, ఉపాధిహామీ ఏపీవో వెంకటేశ్వరరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మండలంలోని వివిధ గ్రామాలలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో ఆయుర్వేద శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగాను ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. మండలంలోని బెల్లంకొండ, వెంకటాయపాలెం, పాపాయపాలెం, చంద్రాజుపాలెం, నాగిరెడ్డిపాలెం పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులతో యోగాసనాలను వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరెడ్డి, ఎంఈవో-2 బాల సుందరరావు, మండల ఆయుర్వేద వైద్యులు మేఘమాల, హెచ్ఎం శాంతి, యోగా టీచర్లు కోటేశ్వరమ్మ, హనుమంతరావునాయక్, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి దూరం



గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలో...



అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో...

రాజుపాలెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అనుపాలెం, గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలల్లో యోగా కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధుల వలన ఎక్కువ మంది మానసిక, శారీరక, రుగ్మతలకు గురి అవుతున్నారని, ఈ ఒత్తిడులను అధిగమించేందుకు యోగాపై దృష్టి సారించాలని తెలిపారు. నిత్యం ప్రాణాయామం సాధన చేస్తే జీవిత కాలం ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణప్రసాద్, ఎంఈవోలు మల్లికార్జునశర్మ, నరసింహారావు, హెచ్ఎం మణిమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రియదర్శిని, తేజస్విని, అలేఖ్య, జ్యోత్స్న, శిరీషభాయి, హన్నాకుమారి, ఏఎన్ఎంలు మేరీ, ధనలక్ష్మీ, నాగమణి, ప్రమీలాభాయి తదితరులు పాల్గొన్నారు.



బెల్లంకొండలోని యోగా దినోత్సవంలో తహసీల్దార్, ఎంపీడీవో, వైద్య సిబ్బంది



పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్‌లో యోగా చేస్తున్న కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి వెంకటరమణ



నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల యోగాసనాలు



ముప్పాళ్ళ జెడ్పీ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



యోగాసనాలు వేస్తున్న అచ్చంపేట కేజీబీవీ పాఠశాల విద్యార్థులు



పెదకూరపాడు జెడ్పీ హైస్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



సత్తెనపల్లి కేంద్రియ విద్యాలయంలో విద్యార్థుల యోగాసనాలు

మాదలలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్



ప్రీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో చిన్నారులు

మాదల(ముప్పాళ్ళ): ఐసీడీఎస్, సత్తెనపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని ఇరుకుపాలెం సెక్టార్ మాదల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇరుకుపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులకు, తల్లులకు అందిస్తున్న సేవలు గురించి వివరించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని, పిల్లల సమగ్రాభివృద్ధికి ఈ కేంద్రాలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారిని పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వీరమ్మ, అన్నపూర్ణ, అంజమ్మ, అనురాధ, వీరకుమారి, శాంతి, సుధారాణి, ఆయాలు పాల్గొన్నారు.

వెంకటాయపాలెంలో జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న గ్రామ నాయకులు

బెల్లంకొండ: జల్ జీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిల ఏర్పాటు పనులు మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఆశ్రమం రోడ్డులో ఉన్న మంచినీటి బోరు నుంచి ముందుగా పైపులైన్ నిర్మించేందుకు గ్రామంలోని టీడీపీ, జనసేన నాయకులు పనులను ప్రారంభించారు. అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు గ్రామంలోని మంచినీటి ఎద్దడిని నివారించేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.42 లక్షలతో పనులను చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మేశం భాస్కరరావు, గ్రామ నాయకులు మేశం యల్లమందరావు, శ్రీరామమూర్తి, భుక్యా నాగమ్మబాయి, శ్రీనునాయక్, చిన్న ఎల్లయ్య, చందు కోటేశ్వరరావు, కొలగాని వెంకటేశ్వరరావు, మెరుగు ఏడుకొండలు, నూకల కోటేశ్వరరావు, తోట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఏడీఏ రవికుమార్, స్థానిక ఏవో డి.పాపకుమారిల పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించారు. ఎరువులు, విత్తనాల దుకాణాల్లో ఇన్‌వాయిస్లు, సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్లు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ లేకుండా ఎవరు విత్తనాలు విక్రయించవద్దని, అనుమతి పత్రాలు లేకుండా విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ చెప్పారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



విద్యావనరుల కేంద్రంలో నేను బడికి పోతా కార్యక్రమంపై సమీక్షలో ఎంఈవో

రాజుపాలెం: ప్రతి గ్రామంలో 6 నుంచి 14 ఏళ్ల వయస్సు గల పిల్లలు పాఠశాలలోనే ఉండాలని, బడి బయట ఉండరాదని ఎంఈవో మల్లిఖార్జున శర్మ తెలిపారు. మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ కొంత మంది చిన్నారులు అక్కడక్కడ బాల కార్మికులుగా మారుతున్నారని, అలాంటి వారిని గుర్తించి బడికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. బడిఈడు పిల్లలందరు తప్పనిసరిగా పాఠశాలలోనే ఉండాలని.. నేటి నుంచి జూలై 12వ తేదీ వరకు 'నేను బడికి పోతా' కార్యక్రమం ప్రతి రోజు నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే గ్రామ, మండల స్థాయి కమిటీలు జరిగాయని, ఈ కమిటీలు ప్రతి గృహాన్ని సందర్శించి బడిఈడు పిల్లలు బడిలో ఉన్నారా, బడి బయట ఉన్నారా అని నిర్ధారిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణప్రసాద్, ఎంఈవో-2 నరసింహారావు, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు హర్షణీయం

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు

క్రోసూరు: విదేశీ విద్య పేరును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్యగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షించదగ్గ విషయమని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు గార్లపాటి దాసు, పల్నాడు జిల్లా డీవీఎంసీ సభ్యులు వి.మరియదాసు అన్నారు. శుక్రవారం క్రోసూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ విగ్రహాల సెంటర్ వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్య పేరును గత ప్రభుత్వం తొలగించగా నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం తిరిగి అంబేడ్కర్ విదేశీ విద్యగా పునరుద్ధరించడం హర్షణీయమని తెలిపారు.

ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

పెదకూరపాడు ఎన్నికల నిర్వహణ అధికారి కందుల శ్రీరాములు



పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించిన ఎస్‌సీసీ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ అధికారులకు నియోజకవర్గ ఎన్నికల అధికారి కందుల శ్రీరాములు కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు కందుల శ్రీరాములకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అందరూ సహకరించారన్నారు. పెదకూరపాడు తహసీల్దారు జి.ప్రభాకర్ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



సత్తెనపల్లి: అప్పుల బాధ తాళలేక రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బూరు గ్రామానికి చెందిన ధూళిపాళ్ల బ్రహ్మయ్య (47) శుక్రవారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంత సేపటికీ రాలేదు. ఈ క్రమంలో ఇంటి వెనుక పొలంలో బ్రహ్మయ్య అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. సమీపంలో గడ్డి మందు డబ్బా ఉంది. దీంతో హుటాహుటిన బ్రహ్మయ్యను సత్తెనపల్లిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బ్రహ్మయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య భువనేశ్వరి, కుమారులు శేఖర్, పవన్‌లు ఉన్నారు. శేఖర్ తండ్రికి వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటుండగా పవన్ బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. బ్రహ్మయ్యకు సొంత పొలం ఎకరం ఉండగా మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని 20 ఏళ్ల నుంచి సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో రూ.20 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బ్రహ్మయ్య మృతదేహానికి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.